


గతం గతం.. ఇది చేతికర్రల మనోగతం
పథం పథం.. ఇది మరో సేవాపథం
తరం తరం.. ఇది అరుపదుల నవతరం
స్వరం స్వరం.. ఇది నవ చైతన్యపు గళం
క్షణ క్షణం.. మలి దశ సేవకే అంకితం..

... పడమటింటి రవికుమార్

# కీట్స్.. ఓ ఆపన్నహస్తం

సంసారాన్ని లాగీ లాగీ అలసిన వయసు వాళ్లది. కష్టసుఖాలను ఏళ్లుగా తలపై మోసిన ప్రాయం వారిది. పసిపాపలా లాలన పొందాలనుకునే మలి, ముసలి దశ వాళ్లది. చేతికర్రతో సాయమడిగే స్థితి వారిది. బంధాల్లా జారిపోయే కళ్లజోడును తల వెనుకాలకు లాగి కట్టే స్థితి వాళ్లది. ఇక్కడ కొందరు యువకులు పుట్టుకతో వృద్ధులు. కానీ ఇక్కడే కొందరు వృద్ధులు ఉరకలు పెట్టే నవ యువకులు. విశ్రాంతి తీసుకునే సమయంలో అవిశ్రాంతంగా సేవలందిస్తున్నారు. వారి పనులే కాదు.. ఆలోచనలూ ఆచరణీయం. వాళ్లే కీట్స్ సభ్యులు. అందరూ రిటైర్డ్ ఉద్యోగులే. హాయిగా విశ్రాంతి తీసుకోకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ను చుట్టేస్తున్నారు. సమస్యల పరిష్కారాలకు తమ వంతు కృషి చేస్తున్నారు.

కీట్స్ అంటే కాకినాడ ఇంజినీరింగ్ అలుమినీ ట్రస్ట్ ఫర్ సర్వీస్. 1973-74లో కాకినాడ ఇంజినీరింగ్ కాలేజీలో 300 మంది చదువు పూర్తి చేశారు. ప్రస్తుతం వారంతా రిటైర్ అయ్యారు. ప్రజలకు సేవ చేద్దామని వారంతా ఒక్కటై 2014 డిసెంబర్‌లో కీట్స్ సంస్థను ప్రారంభించారు. పింఛన్ డబ్బుల్లోంచి ఎవరికి తోచినంత వారు ప్రతి నెలా సంస్థకు విరాళం ఇస్తున్నారు. ఇప్పటి వరకు తెలుగురాష్ట్రాల్లో రూ. 85 లక్షలు ఖర్చు చేశారు. ఆ డబ్బులన్నీ సంస్థ సభ్యులు సమకూర్చుకున్నవే. వీరు ఏ పనిచేయాలన్నా ప్రతి నెలా రెండో శనివారం బర్కత్‌పురలోని తమ కార్యాలయంలో కలుస్తారు. ఆలోచనలు పంచుకుంటారు. సభ్యులు తెలుగు రాష్ట్రాల్లోని సమస్యలపై చర్చిస్తారు. ఆచరణ దిశగా ముందడుగు వేస్తారు. ఇంతకీ వారేం పనులు చేశారంటే..

## అయిదేండ్లుగా సేవలు

2014లో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా తిరువూరులో సంస్థ మొదటి కార్యక్రమం చేపట్టారు. సంస్థ సభ్యులంతా కలిసి వారి పెన్షన్‌లో తలా ఇంత కలుపుకొని పాఠశాల కోసం రూ.15 లక్షలు ఖర్చు చేశారు. తర్వాత ఖమ్మం జిల్లాలోని చెరువు మాదారం పాఠశాలలో దాదాపు వెయ్యి మొక్కలు నాటించారు. ట్రీగార్డులు పెట్టించారు. పాఠశాల ఆవరణలో బయోటాయిలెట్స్ నిర్మించి ఇచ్చారు. ఆడియో విజువల్ క్లాసెస్ చెప్పించేలా ఏర్పాట్లు చేయించారు. పాఠశాలకు దాదాపు రూ.16 లక్షలు ఖర్చు చేశారు. బొంబాయి తండాలో ఇంటింటికీ మరుగుదొడ్డి కట్టించారు. 'ఎంత ఖర్చయినా పర్లేదు మేం పెట్టుకుంటాం. మీరంతా సహకరించాలి' అని వారందరినీ వేడుకున్నారు'. 213 కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం పోను మిగతా మొత్తాన్ని గ్రామస్తులకు తిరిగి ఇచ్చారు. అదే ఊరిలోని శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించారు. గోడలకు బొమ్మలు వేయించారు. యువతకు ఉపాధికల్పించాలనే ఉద్దేశ్యంతో సర్వే అసిస్టెంట్ కోర్సులో శిక్షణ ఇప్పించారు. దాదాపు 30 మంది యువకులకు రెండు నెలలు శిక్షణకు గాను 4, 5 లక్షలు ఖర్చు చేశారు. ఈ మొత్తాన్ని కీట్స్ సభ్యులే పంచుకున్నారు. 2018 ఫిబ్రవరిలో మెదక్ జిల్లాలోని ధర్మసాగర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో టాయిలెట్లు కట్టించారు. అక్కడ మధ్యాహ్న భోజనం వండడానికి ఇబ్బందవుతున్నదని తెలిసి ఓ షెడ్డు కట్టించారు. 30 మంది బాలికలకు సైకిళ్లు ఇప్పించారు. ఏలూరులోని హెచ్ఐవీ హోమ్‌లో దాదాపు 60 మంది పిల్లలుంటారు. వీరికోసం కీట్స్ సంస్థ ఆధ్వర్యంలో క్రిటికల్ వార్డు ఒకటి కట్టించారు. ప్రత్యేక ట్రీట్‌మెంట్ అందించేలా కృషి చేస్తున్నారు. ఈ హెచ్ఐవీ హోమ్‌లో ప్రత్యేక టాయిలెట్లను కూడా కట్టించారు. ఇందుకోసం దాదాపు రూ. 15 లక్షలు ఖర్చు చేశారు. కస్తూరిబా గాంధీ నేషనల్ మెమోరియల్ ట్రస్ట్‌లో ప్రతి ఏడాది 50 మందికి ఫీజులు కడుతున్నారు. 2015 నుంచి ఇప్పటివరకు ఏడాదికి రూ.5 నుంచి 7 లక్షల వరకు కీట్స్ సభ్యులు తలా ఇంత జమ చేసుకుని ఖర్చు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో చదువు పూర్తి చేసుకున్న వారికి బోటిక్, టైలరింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. పుల్వామా దాడిలో మరణించిన సైనికుల కుటుంబాలకు రూ. 3 లక్షలు అందించారు. అఫ్జల్‌గంజ్ సెంట్రల్ లైబ్రరీలో టాయిలెట్స్ కట్టిస్తున్నారు.

## అంతా మలి వయస్కులే..

ఈ సంస్థలో సభ్యులంతా మలివయస్కులే. హాయిగా ఇంట్లో విశ్రాంతి తీసుకోవాల్సిన వారే. కానీ ఇంటి పట్టున ఉండడం ఇష్టం లేక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. సంస్థ సభ్యులు ఎవరి పనులు వారు చేసుకుంటూనే పెన్షన్ డబ్బుల్లోంచి సాయం చేస్తున్నారు. తెలంగాణలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు రూ.85 లక్షలు ఖర్చు చేశారు. వితంతు మహిళలకు అండగా నిలుస్తున్నారు. వీరి సేవలు నచ్చి ఎంతోమంది స్వచ్ఛందంగా కీట్స్‌లో చేరుతున్నారు.



## ఆలోచన, ఆచరణ అందరిదీ

మేం కాలేజీలో చదువుతున్నప్పుడు ముళ్ళపూడి కృష్ణమోహన్ రావు ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేవారు. ఆయన తరచూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుండే వారు. ఆయన స్ఫూర్తిగా రిటైరైన తర్వాత మేం కూడా ఏమైనా చేయాలనుకున్నాం. ద్రోణంరాజు వెంకట గిరిధర్ దాదాపు రెండేళ్లు కష్టపడి మా బ్యాచ్ మిత్రులందరి వివరాలు సేకరించారు. దాదాపు 350 ఫ్యామిలీస్ ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారు. మా సంస్థకు చైర్మన్ గిరిధర్, వైస్ చైర్మన్ పీవీ రావు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు రమేశ్ కొసరాజు, జగన్నాథ రావు, ఎంవీ నరసింహారావు, విద్యాసాగర్, జి కొండల్‌రావు, టి. హనుమాన్ రావు, పి. రఘుప్రసాద్, యూఎస్ కో ఆర్డినేటర్ వెల్లంకి జయదేవ్ కీలకంగా పనిచేస్తున్నారు. మా అందరి లక్ష్యం ఒక్కటే ఎడ్యుకేషన్, ఎంపవర్‌మెంట్, ఎన్విరాన్‌మెంట్ విభాగాల్లో వీలైనంతగా మా వంతు సేవ చేయడం.

**- ఎర్రమిల్లి శివ సుబ్రహ్మణ్యం, మేనేజింగ్ ట్రస్టీ, కీట్స్ ఆర్గనైజేషన్**



epaper.ntnews.com